400 గ్రామాలకు నీటి కొరత


మరమ్మతు చేస్తున్న సిబ్బంది

- పెద్దగుట్టవద్ద మిషన్‌భగీరథ పైప్‌లైన్ లీకేజీ
- మూడు రోజులుగా కొనసాగుతున్న పనులు
- పండగకు ఇబ్బంది లేకుండా చేయాలి: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి పెద్దగుట్ట వద్ద మిషన్‌భగీరథ పైప్‌లైన్‌లో ఎయిర్‌వాల్వ్ వద్ద లీకేజీ, 900 ఎంఎం జీరో వెలాసిటీ గ్యాస్‌కిట్లు, స్ప్రింగ్స్ పాడవటంతో మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ కారణంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని దాదాపు 400 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేసి దీపావళికి నీటి ఇబ్బంది లేకుండా చేయాలని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మిషన్‌భగీరథ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల వద్ద ఉన్న మిషన్‌భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ (డబ్ల్యూటీపీ) నుంచి పెద్దగుట్టపై ఉన్న ట్యాంకులకు నీటి సరఫరా అవుతుంది. గుట్టకింద పైప్‌లైన్‌లో ఎయిర్‌వాల్వ్‌ను ఏర్పాటు చేశారు. ఎయిర్‌వాల్వ్ నుంచి కొద్దిపాటి లీకేజీ కొనసాగుతూ వచ్చింది. అయితే కొన్ని రోజులుగా లీకేజీ అధికం కావటంతో నీటి పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీన్ని గుర్తించిన మిషన్‌భగీరథ అధికారులు ఎయిర్‌వాల్వ్ మరమ్మతు చేసేందుకు చర్యలు చేపట్టారు. శుక్రవారం రోజు పైప్‌లైన్ ఎయిర్‌వాల్వ్ వద్ద మరమ్మతు పనులు ప్రారంభించారు. పైప్‌లైన్ 900 ఎంఎం సైజు కలిగి ఉంది. ఇందులో ఉన్న గ్యాస్‌కిట్లు, స్ప్రింగ్‌లు మార్చాల్సి వచ్చింది. అవి స్థానికంగా అందుబాటులో లేకపోవటంతో శనివారం హైదరాబాద్ నుంచి తెప్పించి ఆదివారం బిగించటం చేశారు. ఉదయం నుంచి వెల్డింగ్ పనులు పూర్తిచేసి స్ప్రింగ్‌లు, గ్యాస్‌కిట్లను ఎయిర్‌వాల్వ్ చాంబర్‌లో అమర్చేందుకు చర్యలు తీసుకున్నారు.

ఇబ్బందులు కలగకుండా చూడాలి: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

పెద్దగుట్ట వద్ద ఎయిర్‌వాల్వ్ లీకేజీ, గ్యాస్‌కిట్లు, స్ప్రింగ్‌ల మార్పిడి మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మిషన్‌భగీరథ అధికారులను ఆదేశించారు. సోమవారం దీపావళి పండగ ఉన్నందున ఆదివారం సాయంత్రానికి మరమ్మతులు పూర్తిచేసి అన్ని గ్రామాలకు, మున్సిపాలిటీలకు నీటి సరఫరా చేయాలని సూచించారు.

400 గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా

మరమ్మతుల కారణంగా మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాల్లోని మొత్తం 400గ్రామాలకు నీటి సరఫరా నిలిచింది. శుక్రవారం నుంచి మరమ్మతుల కారణంగా నీటి సరఫరా నిలిచిపోగా, కొన్ని గ్రామాలకు బుధ, మరి కొన్ని గ్రామాలకు గురువారం నుంచి నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో దీపావళి పండగ వేళ నీటి సరఫరాపై సందిగ్ధత ఏర్పడింది. జడ్చర్ల మున్సిపాలిటీలోని జడ్చర్ల హౌజింగ్ బోర్డుకాలనీ, కావేరమ్మపేటకు మల్లెబోయిన్‌పల్లి డబ్ల్యూటీపీ నుంచి నీటి సరఫరా అవుతుండగా, బాదేపల్లి పట్టణానికి సరఫరా నిలిచింది. ఇక మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ అంతట నీటి సరఫరా ఆగిపోయింది.

జిల్లా కేంద్రంలో భారీ వర్షం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా కొత్త బస్టాండు ప్రాంగణంతో పాటు రాయచూర్ రోడ్, మర్లులో కొన్ని గంటల పాటు ఎక్కడికక్కడ వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

క్లుప్తంగా

కబడ్డీ పోటీల్లో బాలికల జట్టు విజేత



మహబూబ్‌నగర్ క్రీడలు: పటాన్‌చెరులో శనివారం ముగిసిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 కబడ్డీ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచింది. ఈ పోటీల్లో బాలికల జట్టు చాంపియన్‌గా నిలిచింది. బాలికల జట్టుకు ఎమ్మెల్యే గుడెం మహిపాల్‌రెడ్డి ట్రోఫీ అందజేశారు. ఉమ్మడి జిల్లా బాలికల జట్టు విజేతగా నిలవడంపై జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

చాలెంజర్ కప్‌లో విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్ల పట్టణంలో ఆదివారం జరిగిన 22వ నేషనల్ లెవల్ వీఐపీ చాలెంజర్ కప్‌లో మహబూబ్‌నగర్‌కు చెందిన జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే దూ ఇండియా విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు జీకే మాస్టర్ షోటోకాన్ మహబూబ్‌నగర్ పట్టణ ఉపాధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ నవీన్ కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించడం జరిగిందన్నారు. జి.వైష్ణవి, పి.అక్షయణి, ఎం.కౌషిక్, ఎం.గౌరవ్, ఎస్.శాన్వి బంగారు పతకాలు సాధించారు. బి.సాయి రుత్విక్ రజతం, ఎస్.హర్షవర్ధన్, డి.రోహన్ తేజ్ కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులు జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే దూ ఇండియా ఫౌండర్ చీఫ్ జి.కృష్ణయ్య అభినందించారు. కార్యక్రమంలో టోర్నీ చీఫ్ ఆర్గనైజర్ సయ్యద్ అశ్వాక్, ఇన్‌స్ట్రక్టర్లు కె.సోనల్, నవతేజ, బి.వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో బంగారు పతకాలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్ల పట్టణంలో ఆదివారం జరిగిన నేషనల్ లెవల్ వీఐపీ చాలెంజర్ కరాటే పోటీల్లో చిన్నదర్పల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించినట్లు జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే దూ ఇండియా జిల్లా అధ్యక్షుడు, సీనియర్ కరాటే మాస్టర్ శివకుమార్ తెలిపారు. ఆయా విభాగాల్లో కె.శ్రావణి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, పి.స్వాతి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను జీకే మాస్టర్ షోటోకాన్ చీఫ్ జి.క్రిష్ణయ్య, కరాటే మాస్టర్ శివకుమార్ అభినందించారు.

సగర సంఘం నూతన కార్యవర్గం

మెట్టుగడ్డ: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సగర సంగం కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మహబూబ్‌నగర్ మండల, యువజన నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు హనుమంతు సాగర్, ప్రేమ్‌సాగర్ తెలిపారు. ఎన్నుకున్న నూతన కార్యవర్గాన్ని జిల్లా సగర సంఘం అధ్యక్షుడు ప్రణీల్‌చందర్ సన్మానించారు. మహబూబ్‌నగర్ మండల సగర సంఘం అధ్యక్షుడిగా సత్యంసాగర్, ప్రధాన కార్యదర్శిగా చిన్నబాలరాజును ఎన్నుకున్నారు. యువజన సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్‌సాగర్, కార్యదర్శిగా శివకుమార్ సాగర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుడ్డన్న సాగర్, రవీందర్ సాగర్, గోవర్ధన్ సాగర్, తరుణ్ సాగర్ రమేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లిలో తాగునీటి సమస్య

నవాబుపేట: మండలంలోని లింగంపల్లి గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. కొన్ని రోజులుగా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించటం లేదు. సంబంధిత అధికారులకు నీటి సమస్య వివరించినా లాభం లేదని గ్రామస్తులు వాపోయారు. నల్లాల నిర్వహణ విషయంలో అధికారులు విఫలం కావటంతో నీళ్లు అందటం లేదు. గ్రామంలో ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తున్నా, సరిపోవటం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి తాగునీటి ఇబ్బందులు తొలగించాలని కోరారు.

ముమ్మరంగా బీటీ పనులు

జడ్చర్ల: సిగ్నల్‌గడ్డపై బీటీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రెండు రోజులుగా పనులు కొనసాగుతున్నాయి. సిగ్నల్‌గడ్డ నుంచి కల్వకుర్తి రోడ్డు వైపు బీటీ పనులు కొనసాగించారు. వంతెనపై బీటీ పనులు చేపట్టారు. ఇక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పాత బస్టాండ్ వైపు బీటీ పనులు చేపట్టేందుకు పనులను ముమ్మరం చేశారు. వంతెనపై బీటీ పనులు చేపట్టిన తరువాత సాయంత్రం అకస్మికంగా వర్షం కురిసింది. దీంతో బీటీ నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. అధికారులు బీటీ పనులు నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అనుభవాలు అభివృద్ధికి ఉపయోగించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మెట్టుగడ్డ: సీనియర్ సిటిజన్స్ అనుభవాన్ని మహబూబ్‌నగర్ అభివృద్ధికి ఉపయోగిద్దామని, సమాజానికి చాలా అవసరమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ పారిశ్రామిక వాడలో మున్సిపల్ నిధులతో నిర్మించిన సీనియర్ సిటిజన్ ఫోరం నూతన భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ ఫోరం సేవలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమం కోసం పనిచేస్తానని, సీనియర్ సిటిజన్స్ ఫోరానికి కోటి రూపాయల నిధులు అందజేస్తానని హామీ ఇచ్చారు. ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లే ఫోరం సభ్యులకు 25శాతం రాయితీ ఇచ్చే విధంగా ఆస్పత్రి యజమాన్యాలతో మాట్లాడి ఒప్పిస్తానని చెప్పారు. సీనియర్ సిటిజన్స్ సభ్యుల కోసం అధునాతన గ్రంథాలయం త్వరలో ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మార్కెట్ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ,,షబ్బీర్ అహ్మద్, వినోద్‌కుమార్, సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు జగపతిరావు, ఉపాధ్యక్షులు రాజసింహుడు,కార్యదర్శి నాగభూషణం, గంగాధర్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు పెంపొందించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఏనుగొండ కన్వెషన్‌లో ఏర్పాటు చేసిన పీఆర్టీయూ సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి గొప్పదని, అధునాతన పద్ధతిలో శాస్త్రీయ విధానంలో ఉపాధ్యాయులు బోధిస్తున్నారని, దాని వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజన కరంగా ఉంటుందన్నారు. ఇటీవలి జరిగిన టీఎల్ఎం మేళాలలో ప్రదర్శన చాలా బాగుందని, భవిష్యత్‌లో విద్యాభివృద్ధి కోసం మరిన్ని ప్రయోగాలు చేయానల్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కార్యదర్శి బిక్షంగౌడ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధన్‌మోహన్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, పేరి వెంకట్‌రెడ్డి, గట్టు వెంకట్‌రెడ్డి, రఘురాంరెడ్డి, నారాయణగౌడ్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకే చోట టపాకాయల దుకాణాలు



నవాబుపేట: జనవాసాల మధ్య, ఇళ్ల ముందు టపాకాయల దుకాణాలు ఏర్పాటు నేరమని ఎస్ఐ విక్రమ్ సూచించారు. దీంతో వ్యాపార సంఘం అధ్యక్షుడు, వ్యాపారులు అందరు కలిసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండ మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో టపాకాయలు విక్రయించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో ఆదివారం మండల కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో జెడ్పీ పాఠశాల ఆవరణలో టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలకు సైతం ఒకే చోట టపాకాయల దుకాణాలు లభించటంతో సౌకర్యంగా మారింది.

తప్పుడు కేసులతో వేధింపులు ఆపాలి

పాలమూరు: తనపై తప్పుడు కేసులు పెట్టడంతో పాటు ఫోన్ ట్యాప్ చేసి వ్యక్తిగత వివరాలను తెలుసుకుంటున్నారని తెలంగాణ కాంగ్రెస్ శిక్షణ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ధారా భాస్కర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కొంత కాలంగా రాజకీయంగా తనను అణిచివేయడానికి కుట్రలు చేస్తున్నారని తెలిపారు. ఇటీవల నవాబ్‌పేట పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదులతో పాటు తప్పుడు కేసులు నమోదు చేయించారని, దీని వెనుక జడ్చర్ల ఎమ్మెల్యే అన్న జనంపల్లి దుశ్యంత్‌రెడ్డి కుట్ర చేసి అందరిపై ఒత్తిడి చేసి ఫిర్యాదు చేయించారని తెలిపారు. ఫోన్ కాల్‌డేటాను అక్రమంగా తెలుసుకుంటున్న విషయంపై ఇటీవల డీజీపీకి సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో పూర్తి స్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

సాహిత్య కార్యక్రమాలు విస్తృతం చేస్తాం


జేఎస్‌పీ జిల్లా శాఖ నూతన కార్యవర్గం

స్టేషన్ మహబూబ్‌నగర్: జాతీయ సాహిత్య పరిషత్ పాలమూరు జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉమ్మెంతల మహేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై ఎన్నికల ప్రక్రియను నిర్వహించగా జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకుంది. జిల్లాశాఖ నూతన అధ్యక్షుడిగా ఇరువింటి వెంకటేశ్వరశర్మ, ఉపాధ్యక్షులుగా చక్రవర్తుల రమణాచార్యులు, ప్రధాన కార్యదర్శిగా పి.కృష్ణమోహన్, సహ కార్యదర్శిగా అంబుజా, కోశాధికారిగా బింగిదొడ్డి వెంకటేశ్‌లను ఎన్నుకున్నారు. జిల్లాకు చెందిన కవి పండితులు పొద్దుటూరు ఎల్లారెడ్డి, బాదేపల్లి వెంకటయ్య, బి.కాళిదాసు జిల్లాశాఖకు గౌరవ సలహాదారులుగా వ్యవహరించడానికి అంగీకారం తెలిపినట్లు నూతన కార్యవర్గం ప్రతినిధులు వెల్లడించారు. జిల్లాలో సాహిత్య కార్యక్రమాలను విస్తృతం చేస్తూ యువ రచయితలను ప్రోత్సహించే దిశగా నూతన కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు శాంతారెడ్డి, రవి చంచల, మోనయ్య, వెంకటయ్యగౌడ్, రమణాచార్యులు పాల్గొన్నారు.

వెన్నచేడ్ వాసికి గ్రూప్- 2 ఉద్యోగం



గండేడ్: మండలంలోని వెన్నచేడ్ గ్రామానికి చెందిన చక్రధర్ రెడ్డి గ్రూప్ 2 ఉద్యోగం సాధించారు. ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పారామంలో ప్రభుత్వం నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈయన గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ మద్దురు వెంకట్‌రెడ్డి పెద్ద కుమారుడు చక్రధర్‌రెడ్డి. గ్రూప్ 2 ఉద్యోగంలో భాగంగా అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా నియామక పత్రాన్ని అందుకున్నారు.

డీఎస్పీగా ఎంపికైన సౌమ్యకు సన్మానం

జడ్చర్ల: మండల పరిధిలోని లింగంపేట్ గ్రామానికి చెందిన సౌమ్య ఇటీవల గ్రూప్–1లో డీఎస్పీగా ఎంపిక కావడంతో ఆమెను ఆదివారం లింగంపేట గ్రామంలో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాహెర్, మాజీ సర్పంచ్ హైమావతి,తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లతో ముస్లింల జీవితాల్లో మార్పు



విద్యార్థులను సన్మానించిన ఫారుఖ్ హుస్సేన్

స్టేషన్ మహబూబ్‌నగర్: దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్లతో ఈ రోజు ముస్లింల జీవితాలను పూర్తిగా మార్చి వేశాయని, దాని కారణంగానే ముస్లిం విద్యార్థులు ఉన్నతవిద్యకు ఎంపికవుతున్నారని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహెబూబియా హాల్‌లో ఆదివారం ఆల్‌మేవా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది నీట్‌లో ఏ కేటగిరిలో ఎంపికైన 17 మంది ఎంబీబీఎస్ విద్యార్థుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వహీద్‌షా మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 14 మందిని, కొత్తకోట నుంచి ముగ్గురిని ఎంపిక చేసి సన్మానం చేసి నట్లు తెలిపారు. వీరిలో 14 మంది బాలికలు ఉండడం హర్షదాయకమన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ షేక్ ఫరీద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాదర్‌వలి, మహ్మద్ హబీబ్ అబ్దుర్ ర హెమాన్, సయ్యద్ సజ్జాద్ అహ్మద్, మహ్మద్ జమీర్ అహ్మద్, ఖాజా నిజాముద్దీన్‌తోపాటు ఆల్‌పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ కమిటీ జిల్లా కన్వీనర్ మోసీన్‌ఖాన్, మహ్మద్ రహీం, నిజాముద్దీన్, మహ్మద్ ఖయ్యూం, నూరుల్ హసన్, వెంకటరామారెడ్డి, అజీమ్ పాల్గొన్నారు.

దేవరకద్రకు రైల్వే సబ్ వే మంజూరు



దేవరకద్ర: దేవరకద్ర పట్టణ ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న రైల్వే సబ్ వేను మంజూరు చేసినట్లు రైల్వే డీజీఎం ఆదివారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి ఫోన్ ద్వారా తెలిపారు. దీంతో ప్రజల ఇబ్బందులు దూరమయ్యే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల ముందు దేవరకద్ర ఆర్వోబీ ప్రారంభమైన తరువాత ప్రజలకు ఇబ్బందులు మొదలయ్యాయి. ఆర్వోబీ వల్ల ట్రాఫిక్ సమస్య తొలిగి పోతుందని ప్రజలు భావించారు. అయితే మొదటికే మోసం వస్తుందనే విషయం గమనించలేదు. దేవరకద్ర పట్టణం రెండుగా వీడిపోవడంతో పాటు బస్టాండ్‌లోకి బస్సుల రాక పోకలు లేక మూత పడింది. గేటును మూయడం వల్ల పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ ప్రాంతంలోని వ్యాపార కేంద్రాలన్ని మూత పడ్డాయి. ప్రజలు అటు ఇటు వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇలా ఎన్నో రకాల ఇబ్బందులు పడ్డ ప్రజలు కనీసం అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని కోరుతూ వచ్చారు. ద్విచక్ర వాహనదారులు ఓవర్ బ్రిడ్జిపై చుట్టూ తిరగలేక మూసిన గేటు వద్ద బైక్‌లను ఆపి నడుచుకుంటు వెళ్తున్నారు. ఇక ప్రజలు నిత్యం పట్టాలు దాటుతూ అటు ఇటు వెళ్తున్నారు.


ఎన్నికల హామీతో..

గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు రైల్వే గేటు వద్ద అటు ఇటు వెళ్లడానికి దారి చూపాలని కోరారు. తమ సమస్య పరిష్కరించాలని అభ్యర్థులకు మొర పెట్టుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చడానికి ఇటు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తరచు రైల్వే జీఎంను కలిసి సమస్యను వివరిస్తు వినతి పత్రాలు ఇస్తు వచ్చారు. వారం క్రితం రైల్వే డీజీఎంను కలిసి సబ్‌వే విషయం చర్చించారు. ఎంపీ డీకే అరుణ తన వంతు ప్రయత్నం చేశారు. జిల్లాలో రైల్వే సమస్యల్లో దేవరకద్ర సబ్‌వే విషయం కూడా చేర్చి మంజూరు చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని పలుమార్లు కోరింది, ఆదరి కృషి వల్ల దేవరకద్రకు సబ్‌వే మంజూరైనట్లు తెలిసింది.

ఎమ్మెల్యేను అభినందించిన నేతలు..

దేవరకద్ర సబ్‌వే మంజూరు కావడంతో ఆదివారం ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని దేవరకద్ర మండల నాయకులు కలిసి అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. దేవరకద్ర మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, అంజన్‌కుమార్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఆదిహన్మంతరెడ్డి, నర్వ శ్రీనివాసరెడ్డి, ఫారూఖ్, రాంపాండు ఇంకా పలువురు ఎమ్మెల్యేను కలిశారు. త్వరలో పనులు ప్రారంభించాలని కోరారు.

సైకిల్‌పై 18 వేల కి.మీ., ప్రయాణం


మల్లేష్‌గౌడ్‌ను అభినందిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగర పరిధిలోని బోయపల్లికి చెందిన మునిమంద మల్లేష్‌గౌడ్ ఏడాది కాలంలో సైకిల్‌పై సుమారు 18 వేల కి.మీ., ప్రయాణం చేసి తిరిగి ఆదివారం ఇంటికి చేరుకున్నాడు. ఈ యువకుడు దేశంలోని 12 ద్వాదశ జ్యోతిర్లింగాలు, చార్‌ధామ్ యాత్ర, పంచారామాలు, పంచభూత లింగాలు, తొమ్మిది శక్తి పీఠాలను దర్శించుకున్నాడు. ఈ సాహస యాత్రను ముగించు కుని వచ్చిన అతడికి నగర ప్రజలు క్లాక్‌టవర్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం పలు ధార్మిక సంస్థలు సన్మానించాయి. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ పాలమూరు బిడ్డ దేశాన్ని సైకిల్‌పై చుట్టి రావడం గర్వంగా ఉందన్నారు. జిల్లా ఖ్యాతిని నలువైపులా చాటి చెప్పడంపై సంతోషం వ్యక్తం చేశారు.